పైకంతో పని లేకుండా..

చేతిలో నగదు లేకపోయినా.. వెంట వాలెట్ తీసుకెళ్లకపోయినా పైకంతో పని లేకుండా డిజిటల్ చెల్లింపుల రూపంలో ఆర్థిక లావాదేవీలు జోరుగా జరిగిపోతున్నాయి. రోడ్డు పక్కన చిరు వ్యాపారి నుంచి పెద్దపెద్ద మాల్స్ వరకు ఎక్కడైనా.. ఎంత మొత్తమైనా డిజిటల్ రూపంలో చెల్లింపులు జరిగిపోతూ అంతా ఆన్‌లైన్‌మయం అయిపోయింది. సులువుగా.. చిల్లర సమస్య మాట లేకుండా పనులు అయిపోతున్నాయని అటు వ్యాపారులు.. ఇటు వినియోగదారులు చెబుతున్నారు.

- ఎక్కడ చూసినా డిజిటల్ లావాదేవీలే
- క్రమంగా తగ్గుతున్న నగదు వినియోగం
- చిరు వ్యాపారుల నుంచి బడా షాపింగ్ మాల్స్ వరకు అదే హవా
- ఏడాదికి రూ.10,300 కోట్లకు చేరిన ఆన్‌లైన్ నగదు వినియోగం



అల్లిపురం : దేశంలో పెద్ద నోట్ల రద్దు తర్వాత డిజిటల్ పేమెంట్స్ వినియోగం పెరిగింది. మొదట్లో అంతగా ఉత్సాహం చూపని వారు కూడా ప్రస్తుతం దానికి అలవాటు పడ్డారు. తొలుత చిన్నగా ప్రారంభమైన యూపీఐ చెల్లింపులు క్రమంగా పుంజుకున్నాయి. గత కొన్నేళ్లుగా భారత్‌లో యూపీఐ చెల్లింపులు నిలకడగా పెరుగుతూ ఏడాదికి సగటున 50 శాతం వృద్ధి సాధించడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో రానున్న మూడేళ్లలో యూపీఐ రోజువారీ చెల్లింపులు రూ.100 కోట్లకు చేరుకోవచ్చని ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ ఇండియా (పీడబ్ల్యూసీ) తన నివేదికలో వెల్లడించింది. 2022–23లో మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ లావాదేవీలు 75 శాతం పెరిగి రూ.10,300 కోట్లకు చేరుకున్నాయని నివేదికలో వెల్లడించారు. యూపీఐ లావాదేవీల తర్వాతి స్థానాన్ని క్రెడిట్, డెబిట్ కార్డులు చేరుకునే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.

మొదట్లో మాకు నచ్చలేదు..



మొదట్లో డిజిటల్ చెల్లింపులపై మాకు అవగాహన ఉండేది కాదు. రాను రాను దాని విలువ తెలుసుకున్నాను. డిజిటల్ చెల్లింపుల వలన లాభమే తప్ప నష్టం లేదని గ్రహించాం. ప్రధానంగా చిల్లర సమస్యకు విముక్తి కలిగింది.

– బొడ్డు పోలారావు, పంక్చర్ షాపు యజమాని

బ్యాంకులకు వెళ్లే అవసరం తగ్గింది..



యూపీఐ లావాదేవీల వినియోగం పెరిగిన తర్వాత మా పని సులువయింది. కలెక్షన్ కూడా యూపీఐ ట్రాన్సాక్షన్ ద్వారా చెల్లిస్తున్నారు. కౌంటర్ సేల్స్ కూడా ప్రతి రోజు బ్యాంకుకు వెళ్లి చెల్లించాల్సిన పని లేదు. ఖాతాదారులు నేరుగా మా అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తుండడంతో మాకు లావాదేవీల పని సులభతరం అయింది.

– బొడ్డేటి ప్రసాద్, విష్ణుప్రియ ఎంటర్‌ప్రైజెస్

అందరూ డిజిటల్ చెల్లింపులే చేస్తున్నారు..



కొబ్బరి బొండాల కోసం వచ్చిన వారు దాదాపు 50 శాతం మంది ఫోన్ పే చెల్లింపులు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఫోన్ పే ద్వారా రూ.10 అయినా రూ.100 అయినా ఎంత అమౌంట్ అయినా క్షణాల్లో చెల్లిస్తున్నారు. దీని వలన మాకు పేమెంట్ సులువుగా మారింది. ఇది మంచిదే. కానీ ఒక్కోసారి సమస్యలు వస్తున్నాయి.

– మొల్లేటి రాజు, కొబ్బరి బొండాల వ్యాపారి

చేతిలో నగదు లేకపోయినా..



గతంలో ఎక్కువ మొత్తంలో షాపింగ్ చేసేందుకు వెంట నగదు తీసుకెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆ అవసరం లేకుండా పోయింది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌ల ద్వారా చెల్లింపులు చేయటం ఈజీ అయింది. మగవాళ్ల కంటే మహిళలకు ఇది చాలా సౌకర్యవంతంగా ఉంది.

– శరగడం శిరీష,

రూ. 53 వేలు పలికిన గణపతి లడ్డు



ఆకట్టుకున్న నవదుర్గల నృత్యం



వేలంలో గణపతి లడ్డూ దక్కించుకున్న బత్తిన గణేష్ దంపతులు

అల్లిపురం : శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల 18వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా గణపతి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా గణపతి లడ్డు వేలం వేయగా బత్తిన సతీష్ ఆ లడ్డూను రూ.53 వేలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గణపతి కరుణ తనపై ఉందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నవదుర్గల నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గణపతి తిరువీధి ఉత్సవం నీలమ్మ వేపచెట్టు, బంగారమ్మమెట్ట, అల్లిపురం మెయిన్‌రోడ్డు, సౌత్ జైలురోడ్డు ప్రాంతాల్లో బాణసంచా, తీన్మార్ నృత్యాలతో కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీకే ఫౌండేషన్ చైర్మన్ భీశెట్టి గోపీకృష్ణ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సహకరించిన గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ సభ్యులకు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభం



సత్యదేవునిపై ప్రవచిస్తున్న భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ



పారాయణ చేస్తున్న మహిళలు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారోత్సవాల్లో భాగంగా ప్రముఖ ప్రవచనకర్త, గాన విద్వాంసుడు భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో దేవస్థానంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారోత్సవాల్లో కార్యక్రమాలివి..

ధర్మప్రచార వారోత్సవాలు ఈ నెల 14 వరకు నిర్వహించనున్నారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ ధర్మం మరింత వ్యాప్తి చెందేందుకు దేవదాయ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 9న హరికథ, 10న భక్తి సంగీతం, 11న కూచిపూడి నృత్యాలు, 12న భజనలు, 13న కోలాటాలు, 14న పారాయణ నిర్వహించనున్నారు.

రోడ్లు వెలవెల..



నిర్మానుష్యంగా మారిన టౌన్‌కొత్తరోడ్డు



వెలంపేట రాజారామ్మోహన్‌రాయ్ రోడ్డులో ఇలా..

- ఎండకు భయపడి ఇళ్లకే పరిమితమైన జనం
- అధిక ఉష్ణోగ్రత.. ఉక్కపోతతో విలవిల

డాబాగార్డెన్స్ : అసలే ఆదివారం. ఆపై ఉదయం నుంచి ఉక్కపోతతో నియోజకవర్గంలోని రోడ్లన్నీ వెలవెలబోయాయి. వేసవిని మించి ఎండలు కాస్తుండడంతో నగర ప్రజలు విలవిల్లాడారు. మధ్యాహ్నం ఇంటికే పరిమితం అయ్యారు. భారత్–ఆస్ట్రేలియా మధ్య ప్రపంచ కప్ వన్డే మ్యాచ్ జరుగుతుండడంతో బయటికి వెళ్లకుండా టీవీలకు అతుక్కుపోయారు. సాయంత్రం ఎండ వేడిమి తగ్గాక మార్కెట్‌కు పయణమయ్యారు. దైనందిన కార్యక్రమాలు పూర్తి చేసుకున్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

అల్లిపురం : కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందిన 33వ వార్డు, వేంకటేశ్వరమెట్ట ప్రాంతానికి చెందిన జాగరపు చిన్నా కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేతలు అండగా నిలిచారు. నియోజకవర్గం నాయకుడు సీతంరాజు సుధాకర్ తరఫున ఆ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆదివారం వార్డు నాయకులు, కార్యకర్తలు భీశెట్టి రాజు, సంతోష్, హరి, రంజిత్‌లతో కలిసి చిన్నా కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

దేవీ శరన్నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : పాతనగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 15 నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన సమావేశంలో అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పూసర్ల సురేష్‌కుమార్, సుగ్గు అరుణ్‌కుమార్, దోమా వెంకట సతీష్‌కుమార్, దేవస్థానం సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పట్టభద్రులకు వీడ్కోలు



స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్‌గా బంగారు పతకం సాధించిన కిరణ్మయితో అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : శ్రీకాశ్యప్ డిగ్రీ కళాశాల 2020–23 డిగ్రీ బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం, వీడ్కోలు కార్యక్రమం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థిని సీహెచ్ కిరణ్మయి స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్‌గా బంగారు పతకం సాధించగా, మిగిలిన విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ రవిశంకర్‌వర్మ మాట్లాడుతూ విద్యార్థులే దేశానికి గొప్ప ఆస్తి అన్నారు. యువతరం గ్రాడ్యుయేట్లు పారిశ్రామిక విజయానికి ఆశా కిరణమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.నారాయణమూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదల ఎదుగుదల



మాట్లాడుతున్న జె.బి.రాజు

సీతంపేట: పేదలు ఎదగాలంటే విద్యే మూలమని, ప్రపంచ బ్యాంకు నిబంధనలకు తలొగ్గి పాఠశాలలను మూయవద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విద్యారంగ పరిరక్షణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సేన అధ్యక్షుడు జె.బి.రాజు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను నాశనం చేసే 117 జీవోను రద్దు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం పేరుతో స్కూళ్లు మూసివేయడం విరమించుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు, రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎల్.వి.ప్రసాదరావు, తుమ్మడి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండదండలు



సమావేశంలో మాట్లాడుతున్న వాసు

సీతమ్మధార : ఏయూటీడీ–జీవీఎంసీ షెల్టర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం నిర్వహించారు. డైమండ్‌పార్కు వాకర్స్ అసోసియేషన్, తెన్నేటి లాఫర్ క్లబ్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 10న నిరాశ్రయుల దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. దాతలు సమకూర్చిన భోజనం వసతిగృహంలో ఉంటున్న వారికి అందజేస్తూ, రోడ్డుపై ఉంటున్న అభాగ్యులను షెల్టర్‌కు పంపిస్తున్నామన్నారు. తెన్నేటి లాఫర్ క్లబ్ ప్రతినిధి ఐ.టి. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ షెల్టర్లకు కావల్సిన బట్టలు, భోజనం అందిస్తూ తమ వంతు సహకరిస్తున్నామన్నారు. రెండు క్లబ్‌ల తరఫున 80 మంది సభ్యులు నిరాశ్రయులకు అండగా ఉంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డైమండ్‌పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగారావు పటాన్నయక్, సెక్రటరీ కుమార్, సభ్యులు టి.ప్రసాద్, పి.జనార్దన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపై పోరుకు భెల్ సిటు సంఘీభావం



రిలే నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న భెల్ సిటు నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ సంఘీభావం తెలుపుతుందని సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. ఆదివారం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర జరుగుతున్న 918వ రోజు రిలే నిరాహార దీక్షలో భెల్ సిటు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటు ప్రధాన కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో స్టీల్‌ప్లాంట్ స్థాపించబడిందని, ఎన్నో ఉద్యమాలతో ఏర్పడిన ఈ కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించరాదన్నారు. స్టీల్ పోరాటానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో భెల్ సిటు నాయకులు కె.విజయ్‌కుమార్, కె.నారపురెడ్డి, కె.పవన్‌కుమార్, జి.అచ్చంనాయుడు, జి.రాంబాబు, పి.శివరాం, ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

వేద, యోగా, సంగీత సాధనతో ఆనందమయ జీవితం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వెండి నాణేలు అందిస్తున్న అచ్యుతరామయ్య, సత్యదేవ్



కార్యక్రమంలో పాల్గొన్న సంగీత జనకులం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ఆధునిక సమాజంలో వేద, యోగా, సంగీతపరమైన జీవన విధానం వల్ల సంతోషంగా జీవించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, కంచికామకోటి పీఠం తరఫున వెండి నాణేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇటీవల కంచికామకోటి పీఠం వారు నగరంలో నిర్వహించిన సంగీత గాన ఝురి కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రశంసాపత్రాలు, వెండి నాణేలతో సత్కరించినట్లు చెప్పారు. ముఖ్య అతిథి శంకర మఠం కార్యదర్శి టి.అచ్యుతరామయ్య మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదేశంతో జరిపిన సంగీత ఉత్సవంలో నగరంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారన్నారు. ఈ క్రతువులు సంగీత జనకులం పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. సంస్థల సమన్వయంతో ఎన్నో సత్కార్యాలను చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం తరఫున అచ్యుతరామయ్యను డాక్టర్ సత్యదేవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె. రాజు, సంగీత జనకులం అధ్యక్షులు ఇంద్రగంటి కాశీప్రసాద్, ఐ.రమణీప్రసాద్, సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, డాక్టర్ బాలగణేష్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధా కృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పందిరి రాట ఉత్సవాలు



12వ వార్డు ఈశ్వరీనగర్‌లో పందిరి రాట వేస్తున్న స్థానికులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. ఇందులో భాగంగా జీవీఎంసీ 11, 12 వార్డుల్లో ఆదివారం పలుచోట్ల పందిరి రాట వేశారు. 11వ వార్డు గాంధీనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాట ఉత్సవంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, సంఘం పెద్దలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. 12వ వార్డు ఈశ్వరినగర్‌లో ఎర్ని దుర్గా మహంకాళి నవరాత్రి ఉత్సవాలు కోసం ముహూర్తపు రాటను గురు భవాని కప్ప అభిరామ్ ఆధ్వర్యంలో వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 22న మధ్యాహ్నం అన్నసమారాధన, 24న అమ్మవారికి పసుపు కుంకుమలతో విశేష పూజలు, అభిషేకం, 29న అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఘనంగా వీఎస్ కృష్ణ జయంతి



వీఎస్ కృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూ క్యాంపస్: డాక్టర్ వీఎస్ కృష్ణ జయంతి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్థశాస్త్రం ప్రత్యేక అంశంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వీఎస్ కృష్ణ బీఏ పూర్తి చేశారన్నారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసి 1932లో తనకు ఇష్టమైన విద్యా రంగంలో కృష్ణ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. ఏయూలో అర్థశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరిన ఆయన యూజీసీ చైర్మన్‌గా సైతం పని చేశారన్నారు. ఆయన స్మారకంగా గ్రంథాలయానికి డాక్టర్ వీఎస్ కృష్ణ పేరు పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: ప్రజలంతా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 87వ వార్డు పరిధి మీ సేవ వద్ద గల ఫిష్‌మార్కెట్‌లో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరు ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్స్‌లు, నార సంచులు ఉపయోగించాలని, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని కోరారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలని, ఇంకుడు గంతలను తవ్వి భూగర్భ జలాలను సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, పి.ఎస్.ఎన్.రెడ్డి, కామరాజు, వసంతరెడ్డి, మూర్తి, చంద్రకిరణ్, శ్రీరాములు, దిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.